క్లుప్తంగా

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

రొంపిచెర్ల: మండలంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం పర్యటిస్తారని జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిచ్చిలివారిపల్లెలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి తల్లి చెంగమ్మ కర్మక్రియల కార్యక్రమంలో వారు పాల్గొంటారని తెలియజేశారు.

పరిశ్రమల పరిశీలన సర్వే ప్రారంభం


సర్వేలో ఎంపీడీఓ కుమార్

శాంతిపురం: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాలను సేకరించే ఎంఎస్ఎంఈ సర్వేను ఎంపీడీఓ కుమార్ శుక్రవారం చిన్నారిదొడ్డిలో ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. సర్వేలో పారిశ్రామిక యూనిట్ల వివరాలను సేకరించి అవకాశాలు, అవసరాల ప్రాతిపదికన ప్రభుత్వం వాటికి ఆర్థిక సాయం చేస్తుందని, అలాగే ఉత్పత్తి, మార్కెటింగ్ సామర్థ్యాలను పెంచటం ద్వారా నిరుద్యోగ యువతకు అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పరిశ్రమల నిర్వాహకులు, వ్యాపారులు, చిల్లర దుకాణాల వారు సరైన సమాచారం ఇచ్చి సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

5న సామాజి తనిఖీ ప్రజావేదిక

శాంతిపురం: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన వివిధ పనుల సామాజిక తనిఖీ బహిరంగ వేదికను డిసెంబర్ 5న నిర్వహిస్తున్నట్టు ఏపీడీఓ తుపాకుల హరినాథ్ తెలిపారు. తమ శాఖ, పంచాయతీ రాజ్ శాఖల పరంగా చేసిన పనులపై బుధవారం వరకూ క్షేత్ర స్థాయిలో తనిఖీ కొనసాగుతుందన్నారు. గురువారం నిర్వహించే బహిరంగ ప్రజావేదికలో కూలీలు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

పెండింగ్ టీఏ, డీఏలను మంజూరు చేయరూ!


మాట్లాడుతున్న సరస్వతి

పలమనేరు: అంగన్‌వాడీలు, మినీ అంగన్‌వాడీలకు పెండింగ్‌లోని టీఏ, డీఏలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సరస్వతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీల అసోసియేషన్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. 2017నుంచి బకాయిలు చెల్లించకపోవడం చాలా దారుణమన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాల పోషణ భారమవుతోందని, తమకు పెండింగ్ బకాయిలను చెల్లించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం మరీ ఘోరంగా ఉందని ధ్వజమెత్తారు. గత ఎన్నిల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో స్థానిక నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఈరోజు

మామిడి, టమాట రైతులకు శిక్షణ

శాంతిపురం: మామిడి, టమాట పంటలు సాగు చేస్తున్న రైతులకు శనివారం ఉదయం 10.30 గంటలకు శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నామని, సంబంధిత రైతులు హాజరై దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి వింధ్య కోరారు. మామిడి సాగులో నూతన పద్ధతులు, పూత నుంచి కోత వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే టమాట సాగులో మెలకువలు, మేలైన విత్తనాల ఎంపిక, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను జిల్లా ఉద్యానవన అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేస్తారన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు: తమ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రాము తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు సమస్యలను చర్చిస్తామని, ప్రజాప్రతినిదులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

క్రీడల్లో మెరిశారు!

వివిధ ప్రాంతాల్లో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో పుంగనూరు నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు, క్రీడాకారిణులు సత్తా చాటారు. ఎస్వీయూనివర్సిటీ నిర్వహించిన అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో పుంగనూరు విద్యార్థులు, రాష్ట్ర స్థాయి, నియోజకవర్గ స్థాయి ఖో–ఖో పోటీల్లో రొంపిచెర్ల విద్యార్థినులు సత్తా చాటారు. పలువురి అభినందనలు అందుకున్నారు.

రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీల్లో మేఘన


మేఘనను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, పీఈటీ శ్రీవాణి

రొంపిచెర్ల: రాష్ట్ర స్థాయి ఖో–ఖో పోటీలలో మండలంలోని మోటుమల్లెలకు చెందిన మేఘన ప్రతిభ చాటింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని జిల్లాస్థాయి ఖో–ఖో పోటీలలో రాణించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలు గుంటూరు జిల్లా కారంపూడి ఉన్నత పాఠశాలలో ఇటీవలే నిర్వహించారు. ఈ పోటీలలో చిత్తూరు జిల్లా జట్టు సత్తా చాటి విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో జట్టులో ప్రాతినిధ్యం వహించి, విజయంలో తనవంతు కీలకపాత్ర పోషించిన మేఘనను ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, పీఈటీ శ్రీవాణి అభినందించారు.

అథ్లెటిక్స్‌లో పుంగనూరు విద్యార్థులు


అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులతో ప్రిన్సిపల్ రాజశేఖర్

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎస్వీయూ నిర్వహించిన అథ్లెటిక్స్‌లో సత్తా చాటి మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల హర్డిల్స్ ద్వితీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించిన సిడి.జయలక్ష్మిని, అలాగే అథ్లెటిక్స్‌లో పాల్గొన్న ముబారక్, గంగోత్రి, జీవిత, స్ఫూర్తి, ఆసిఫ్ అలీ, దామోదర్, తరుణ్‌కుమార్, శివాజి, ఉదయ్‌కుమార్, రెహానాను శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు అనిల్‌కుమార్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఖో-ఖోలో రొంపిచెర్ల బాలికలు


ఖోఖో జట్టు విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: పుంగనూరు నియోజక స్థాయి ఖో–ఖో పోటీలలో రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాల జట్టు రన్నర్స్‌గా నిలిచిందని ప్రధానోధ్యాయులు లక్ష్మీదేవి శుక్రవారం తెలిపారు. గురువారం చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఖో–ఖో పోటీలలో తమ స్కూలు జట్టు పుదిపట్ల ఉన్నత పాఠశాలపై ఫైనల్స్‌లో తలపడి రన్నర్స్‌గా నిలిచిందని చెప్పారు. త్వరలో జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని, ఖో–ఖో క్రీడాకారిణులను టీచర్లు అభినందించారు. ఆటల పోటీలకు దూరంగా ఉన్న రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలకు కొత్తగా వచ్చిన పీఈటీ శ్రీవాణి విద్యార్థినులకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించేలా తీర్చిదిద్దుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కుప్పం అభివృద్ధే 'ప్రజా దర్బార్' లక్ష్యం

- కడ పీడీ వికాస్ మర్మత్
- ప్రజల నుంచి సమస్యలపై 314 అర్జీల స్వీకరణ
- రెవెన్యూ, హౌసింగ్ శాఖలవే అధికం


ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కడ పీడీ వికాస్ మర్మత్....

గుడుపల్లి: కుప్పం ప్రాంతాన్ని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రజాదర్బార్ లక్ష్యమని కడ పీడీ వికాస్ మర్మత్ అన్నారు. శుక్రవారం మండలంలోని సోడిగానిపల్లెలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ కేంద్రమైన కుప్పంతోపాటు, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాలలో నెలకు ఏదైనా ఒక మండలంలోని గ్రామ పంచాయతీలో ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో వివిద శాఖలకు సంబంధించి మొత్తం 314 అర్జీలు వచ్చాయని, వీటిలో ఎక్కువగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలకు చెందినవే ఉన్నాయన్నారు. ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి ఆయా శాఖల అధికారులు నెల వ్యవధిలో వీటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజాదర్బార్‌లో సోడిగానిపాళ్యం, దిన్నేపల్లె గ్రామస్తులు నివేదించిన సమస్యలపై కడ పీడీ ఆయా గ్రామాలకు వెళ్లి పరిశీలించారు. అర్జీదారులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ఆర్డీఓ శ్రీనివాసురాజు, నాయకులు డాక్టర్ సురేష్‌బాబు, టీఎం బాబునాయుడు, ఎంపీడీఓ రాధాక్రిష్ణన్, తహసీల్దార్ సీతారాం, సర్పంచ్ సుశీలమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం రేపు

పలమనేరు: పట్టణంలోని పీజేసీ కల్యాణ మండపంలో బెంగళూరు వైదేహీ ఆస్పత్రి వారిచే ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం జరుగుతుందని బాస్ నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించనున్నట్టు అందులో తెలిపారు. అదేవిధంగా స్థానిక లయన్స్‌క్లబ్ వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు డా.మురళీకృష్ణ శుక్రవారం మరో ప్రకటనలో తెలిపారు. ఇక్కడ శంకర్ నేత్రాలయ వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చెన్నైలోని ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు.

బోయకొండలో రాహుకాల పూజలు



చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలను నిర్వహించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి రాహుకాల సమయం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల మధ్య అభిషేక పూజలు చేశారు. కార్తీక మాసపు చివరి శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

పెద్దపంజాణి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రదిమ్మనపల్లెలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సహదేవి కథనం.. మండలంలోని వీరప్పల్లె పంచాయతీ ఎర్రదిమ్మనపల్లెకు చెందిన చంద్రశేఖర్(30) ఈ నెల 22న శుక్రవారం బాత్ రూమ్‌లో కాలుజారి పడి కోమాలోకి చేరుకున్నాడు. వెంటనే కుటుంబీకులు అతడిని తిరుపతి స్విమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు. పలమనేరు ఏరియా ఆస్పత్రిలో శవ పంచనామా చేసినటగ్లు ఎస్ఐ చెప్పారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి


కేజీబీవీలో భోజన తయారీని పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ దేవరాజులు

రొంపిచెర్ల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కేజీబీవీ అడిషనల్ డైరెక్టర్ దేవరాజులు ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పేద బాలికలు వెనుకబడి ఉన్న మండలాలను గుర్తించి కేజీబీవీ పాఠశాలలను మంజూరు చేసిందన్నారు. దీనిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీశారు. విద్యా ప్రమాణాలు బాగా ఉన్నాయని ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు తయారు చేసిన భోజనాన్ని రుచి చూశారు. స్టోర్ రూంలో సరుకులు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీసీడీఓ ఇంద్రాణి, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, కేజీబీవీ ఎస్ఓ సుజాత, సీఆర్పీలు అనసూయ, రాజేంద్ర, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతలో వారిదే కీలకపాత్ర

- పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీలో మున్సిపల్ చైర్మన్


కిట్లు పంపిణీ చేస్తున్న చైర్మన్, కమిషనర్

పుంగనూరు: ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు పారిశుధ్య కార్యక్రమాల్లో నిమగ్నమైన కార్మికులకు ఎంత చేసినా వారి రుణం తీర్చుకోలేమని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలో కమిషనర్ మధుసూదన్ రెడ్డితో కలసి కార్మికులకు నమస్తే పథకం కింద సఫాయి కర్మచారి పీపీఈ కిట్లు పంపిణీ, యూనిఫాం, హెల్మెట్లు, ఆక్సిజన్ మాస్కులు , చేతి గ్లౌజులను పంపిణీ చేసి మాట్లాడారు. పట్టణ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులదే కీలకపాత్ర పోషిస్తున్నారని, వారిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే మున్సిపల్ కార్మికుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి

- అక్రమ వ్యాపారాలపై నిఘా
- పట్టణంలో బైక్ రైడర్లను కట్టడి చేయండి
- సమీక్షలో పలమనేరు డీఎస్పీ ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు: పెండింగ్ కేసుల విషయంలో దృష్టి సారించి వాటిని త్వరిగతిన పరిష్కరించాలని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆదేశించారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన క్రైమ్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. పలమనేరు ప్రాంతం అటు కర్ణాటక ఇటు తమిళనాడు రాష్ట్రాలకు మధ్యలో ఉండడంతో అక్రమ వ్యాపారాలైన బియ్యం, పప్పు, గ్రానైట్, ఇసుక, ఎర్రచందనం మొదలైన వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. పట్టణంలోని కొన్నిచోట్ల తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలున్నాయని, ముఖ్యంగా కొందరు యువకులు బైక్ రైడింగ్‌లు, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, దీనిని సీరియస్‌గా తీసుకుని వారిని కట్టడి చేయాలన్నారు. పట్టణ ఆవాసాల్లో గంజాయి అమ్మకాలు సాగుతున్నట్టు సమాచారం ఉండడంతో దీనిపై కూడా ఫోకస్ పెట్టాలన్నారు. సమీక్షలో పట్టణ సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


యుగంధర్ దంపతులను సత్కరిస్తున్న వైద్యులు

గంగవరం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్న డాక్టర్. యుగంధర్‌ను తోటి వైద్యులు శుక్రువారం సత్కరించారు. పలమనేరు ఏరియా ఆస్పత్రిలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న యుగంధర్ రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డుకు ఎంపికై గత నెల గుంటూరులో ఐఎంఏ ప్రెసిడెంట్ అశోకన్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. పలమనేరు వాసికి అవార్డు దక్కడంపై సమచర వైద్యులు హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో యుగంధర్ దంపతులను ఘనంగా సత్కరించారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రామకుప్పం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి లోకేష్ ఆధ్వర్యంలో శుక్రవారం రామకుప్పం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు బరువు, ఎత్తు వివరాలు సేకరించడంతోపాటు హెచ్‌బీ, ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మస్తాన్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కందకాలతో ఏనుగుల కట్టడి సాధ్యమేనా..?

- గతంలో తవ్విన కందకాలనే ధ్వంసం చేసిన ఏనుగులు
- మళ్లీ కందకాల తవ్వకాలకు పచ్చజెండా ఊపిన కూటమి
- ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారంపై చొరవేదీ?



గత టీడీపీ హయాంలో ఏనుగుల కట్టడి కోసం తవ్వి ఫలితం లేకుండా పోయిన ఎలిఫెంట్ ట్రెంచిలు, కౌండిన్య అభయారణ్యం నుంచి బయటకొచ్చిన ఏనుగుల గుంపు(ఫైల్)

జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య దశాబ్దాలుగా పట్టి పీడిస్తోంది. ఓ వైపు పంటలపై దాడులు చేసి అపార నష్టం, మరోవైపు ప్రజలపై కూడా ఏనుగులు దాడులు చేసి ప్రాణాలు హరిస్తున్నా.. వీటి కట్టడికి పాలకులు శాశ్వత పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవడంలేదు. ఏనుగుల కట్టడికి అప్పట్లో వేసిన సోలార్ ఫెన్సింగ్, అటవీ ప్రాంతాల్లో తవ్విన కందకాలు..ఇవన్నీ ఆచరణలో సత్ఫలితాలు ఇవ్వలేదని తదనంతరం పరిణామాలు తేటతెల్లం చేశాయి.

పలమనేరు: ప్రస్తుతం అధికార కూటమి ప్రభుత్వం కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తెప్పించి ఇక్కడి ఏనుగులను అడవి దాటకుంటా కట్టడి చేస్తామని కొన్నాళ్ల క్రితం ప్రకటించింది. ఆ దిశగా ఎలాంటి చర్యలకూ పూనుకోలేదు. ఇప్పుడు అడవి చుట్టూ ఉపాధి కూలీలతో కందకాలు తవ్వించి ఏనుగులు అడవి నుంచి వెలుపలికి రాకుండా చూస్తామంటోంది. ఇది గతంలోనే విజయవంతం కాలేదు. కందకాలను కూడా ఏనుగులు ధ్వంసం చేసిన చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో మళ్లీ కందకాల పల్లవిని కూటమి ప్రభుత్వం అందుకుంది. ఉపాధి కూలీలతో ఈ పనులు ఎన్నేళ్లు చేస్తారు? ఈ సమస్య అసలు పరిష్కారం అవుతుందా? అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

కందకాలతో ఏనుగుల కట్టడి కాని పనే...

ఏనుగుల సమస్యపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టారు. పది అడుగుల లోతు, పది అడుగుల వెడల్పు కందకాలను కిలోమీటర్ల మేరా కూలీల ద్వారా చేస్తే అది ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి. కౌండిన్య అడవి చుట్టూ గతంలో టీడీపీ హయాంలో జేసీబీలతో కాంట్రాక్టర్ల ద్వారా తవ్వించిన కందకాలను ఏనుగులు యథేచ్ఛగా పూడ్చివేసి దర్జాగా పొలాల్లోకి వస్తున్నాయి. ఇప్పుడు కందకాలు తవ్వినా మళ్లీ అదే పరిస్థితి పునరావృతం అవుతుందనేది గత అనుభవాలు చెబుతున్న చేదునిజం.

గతంలో రూ.2.61కోట్లు వెచ్చించినా..!

పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీ నుంచి ఏనుగులు బయటకు రాకుండా 142 కిలోమీటర్లలో రూ.2.61కోట్లతో ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్‌ల నిర్మాణం గత టీడీపీ పాలనలో సాగింది. అయితే రాళ్లు వాగులున్న చోట ఆ కాంట్రాక్టర్లు పనులను చేయలేదు. దీంతో ఏనుగులు అడవిలోంచి వెలుపలకు వచ్చేస్తున్నాయి. కొన్ని చోట్ల మెత్తగా ఉన్న చోట్ల ఏనుగులు మట్టితో వీటిని పూడ్చి బయటకొస్తున్నాయి. అంతిమంగా లక్ష్యం నెరవేరలేదు.

ఇదీ అసలు సమస్య

పలమనేరు, కుప్పం పరిధిలోని కౌండిన్య అభయారణ్యం 250 కి.మీ మేర మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. ఈ అభయారణ్యంలోనే గుంపులుగా సంచరించే ఏనుగులు 106 వరకూ ఉన్నాయి. ఇవన్నీ మూడు దశాబ్దాల క్రితం తమిళనాడు అడవుల నుంచి ఇక్కడికి వచ్చి చేరినవే. దీంతో అప్పటి ప్రభుత్వం 1984లో ఇక్కడ కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీ ఏర్పాటు చేసింది. ఇందులోకి తమిళనాడులోని మోర్ధన ఫారెస్ట్ నుంచి, కౌండిన్య పడమర వైపు ఉన్న కర్ణాటకలోని బన్నేరుగట్ట, బంగారుపేట, కేజీఎఫ్, తమిళనాడులోని క్రిష్ణగిరి, హోసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి కౌండిన్యలోకి తరచూ ఏనుగులు వస్తున్నాయి. అడవిని దాటి బయటకు రాకుండా ఉండేందుకు టీడీపీ హయాంలో బంగారుపాళ్యం మండలం నుంచి కుప్పం వరకు 130 కి.మీ మేర సోలార్ ఫెన్సింగ్‌ను 40 కి.మీ మేర ట్రెంచిలను ఏర్పాటు చేసింది. అయితే ఏనుగులు ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి, ట్రెంచిలను పూడ్చిమరీ అడవిని దాటి వస్తున్నాయి!

కందకాలతో ఏనుగుల కట్టడి కుదరదు



ఏనుగులను కట్టడి చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం కందకాలను తవ్వించింది. కానీ ఏనుగులు ఈ గుంతల్లోకి రాళ్లను దొర్లించి, దానిపై మట్టి పోసి, సులభంగా పొలాల్లోకి వస్తున్నాయి. మళ్లీ ఇప్పుడు ఉపాధి పనులతో కందకాలను తవ్విస్తే ఫలితం ఉండదు. ఏదైనా శాశ్వతమైన పనులు చేయాల్సిన అవసరం ఉంది.

–ఉమాపతి, రైతుసంఘ నాయకులు, పలమనేరు

'సక్సెస్‌కు ఆ రాష్ట్రాల కార్యాచరణ పాటిస్తే సరి'



ఏనుగుల సమస్యకు ప్రభుత్వాలు ఎన్ని చేసినా సమస్య మాత్రం ఇప్పటివరకు పరిష్కారం కాలేదు. కందకాలను ఏనుగులు అసలు లెక్కపెట్టడం లేదు. సోలార్ ఫెన్సింగ్‌కు అమర్చిన ఇనుపరాడ్లు నాసిరకంగా ఉండడంతో వాటిని ఏనుగులు విరిచేస్తున్నాయి. అందుకే ఏనుగుల సమస్య ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు వాటి కట్టడికి ఏ చర్యలు తీసుకుని సక్సెస్ అయ్యాయో పరిశీలించి ఇక్కడా వాటి కార్యాచరణకు పూనుకుంటే ఫలితం ఉంటుంది.

–గోవిందురెడ్డి, బేరుపల్లె, పలమనేరు మండలం

వీధి కుక్కలపై కొనసాగుతున్న యుద్ధం


పట్టణంలో వీధి కుక్కలను పడుతున్న దృశ్యం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక మున్సిపల్ అధికారులు వీధికుక్కలపై ప్రకటించిన పట్టివేత యుద్ధం కొనసాగుతోంది. తిరుపతి అనిమల్ కేర్ ల్యాండ్ సౌజన్యంతో శుక్రవారం 27 వీధి కుక్కలను పట్టారు. వీటికి వాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించి ఆపై వదలి పెట్టనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. కొన్నాళ్లుగా పట్టణంలో పలువురు కుక్కకాట్లకు గురై ఆస్పత్రుల పాలవడం, దీనిపై స్పందించిన అధికారులు కుక్కల పట్టివేతకు పూనుకోవడం విదితమే. ఇప్పటి వరకూ ఈ వారంలో 714 వీధి కుక్కలను పట్టుకున్నట్టు కమిషనర్ చెప్పారు.

స్మార్ట్ లాకలతో చోరీలకు చెక్


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రొంపిచెర్ల: స్మార్ట్ లాక్‌ల వాడకంతో చోరీలకు చెక్ పెట్టవచ్చునని రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి అన్నారు. అయన శుక్రవారం స్మార్ట్ లాక్‌లపై వ్యాపారులకు, ఆలయ ధర్మకర్తలకు అవగాహన కల్పించారు. మండలంలో 105 ఆలయాలు, 12 మసీదులు, 2 చర్చిలు ఉన్నాయని అన్నారు. వీటిలో విలువైన విగ్రహాలు, హుండీలు ఉన్నాయని తెలిపారు. ఆలయాల్లో స్మార్ట్ లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు, స్మార్ట్‌లాక్‌లను వాడడం వలన చోరీలను తగ్గించవచ్చన్నారు. స్మార్ట్ లాక్‌ను తాకితే సైరన్ మోగుతుందని చెప్పారు. మొదటగా 25 ఆలయాలకు స్మార్ట్‌లాక్‌లను అందించామని తెలిపారు. అలాగే ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు స్మార్ట్‌లాక్‌లను వినియోగించాలని సూచించారు.